"నమః పరమర్షయే తాతపాదాయ" అని పాదములు స్పృశించి నించున్నారు.

"దీర్ఘాయుష్మాన్భవ—నాయనా, ఇంతచీకటి పడేసరికూ ఇక్కడే ఉన్నారేమిటీ—మార్గాలు సరిగా ఉండవు. గర్త పాషాణాదులు భ్రమ ప్రమాదాస్పదాలుగా ఉంటాయి... లేవండి వెళ్లుదాం...ఇదిగో కురంగి! అమ్మా నీ లేడిపిల్ల లేదా!" అంటూ ఆ అమ్మాయిని దగ్గరగా తీసుకున్నారు. ఆమె తలవంచుకొని "నాకు ఉపసూక్తాలు నేర్పుకోవాలని ఉంది. చెబుతారా పితృపాదులు?" అంది ముద్దుగా.

అమ్మా అభ్యంతరమేమి? రేపటినుంచి తీసుకుని ఉదయాన్నే ఆశ్రమానికి వస్తూండు. శ్యామ, భగవాన్లు, దివాంజలి, అంతా ఉంటారు. శ్యామశర్మ నిరంతరం నీలాగా ఉంటాడు. అతడు చెబుతాడు—...ఇంక వెళ్లవలె. రండి" అని ముందు ఆయన నడుస్తున్నారు. వెనక శుకుడు తర్వాత కురంగి వెనుక శ్యామశర్మ ఆయన్ను అనుసరించారు.

"భవిష్యద్గురు దేవులు శ్యామశర్మగారికి నమస్కారాలు" అని వెనక్కి తిరిగి సన్నంగా అని శర్మ ఉత్తరీయ సల్లాలం లాగింది కొంటెపిల్ల.

ఆకలి మంటలు

మధ్యాహ్నం మూడుగంటలికి మొదలెట్టింది మాయవాన. తెరపి లేకుండా దీపాల వేళదాకా కొట్టి అక్కడినుంచి ముసల

వాడి నసుగులా ముసురులోకి మారింది. చెడతాగిన భాగ్య వంతుల్లా చెట్లు జోగిజోగి ఊగుతున్నాయి. ఆకాశానికి ఆకలి గావును. ఉరుముల్తో ఏడుస్తోంది. ఊరుకోమని గాబోలు— బంగారపు కొరడాల్తో ఎవరో కొడుతున్నారు. కొట్టినకొద్దీ ఏడుపు ఎక్కువవుతోంది.

ఈవర్షారాత్రి ఎంతబాగుంది. తలంటుకొన్న ఆడపిల్లలా ప్రతికొమ్మా, ప్రతీతీగా స్వచ్ఛంగా మెరుస్తోంది. ఎత్తుసరోడ్లు నీళ్లు మురుగుకాలవల్లో గలగల పారుతున్నాయి.

వర్షం కురుస్తూంటే ఎన్ని వెచ్చనికోరికలు! నులి వెచ్చని భోజనం—మంచి పట్టెమంచాలమీద కాశ్మీరశాలువల ముసుగుల్లో—ఎత్తైన మేడలమీద—సరసరానికీ సరజాతికి వెచ్చతనం నచ్చేకోరికలు—

భగవంతుని గారాబుబిడ్డలు అనుభవించడానికి పుట్టారు. పురుగులు ఏడిస్తే వారికేనవ్వు. ఆమహాపట్టణంకూడా ఈ వర్షా రాత్రి సుఖం అనుభవిస్తున్నట్టు కదలకుండా ముడుచుకు పడు కుంది. పెంకుటిళ్లూ మేడలూకూడా ఒకదాని నొకటి పలక రించలేక బద్ధకంగా ఊరుకున్నాయి.

వీధిలోపడ్డ ఎంగిలివిస్తరాకు మెతుకులకోసంకరుచుకు దెబ్బ లాడే కుక్కలజంటయొక్క అనాగరిక తాస్థితికి అసహ్యించు కొని వీధిలోకివచ్చిన కాలేజీవిద్యార్థి ఒకడు కంకరరాయితో వాటిని సర్దుబాటుచేసి వెళ్లాడు.

౨

ఒక వీధి కొసలో 'సందేకవళం నాయనా' అనే దౌర్భాగ్యపు కేక బయలుదేరి వస్తోంది. గుడ్డివెన్నెలలో ఆమె స్వరూపం బాగా కనపడడం లేదు. వర్షంలో ఆమె గుడ్డపేలికలు తడిసి ఎక్కడి వక్కడ అంటుకుపోయాయి. జుట్టుకొసలనుంచి నీరు కారుతోంది. అప్పుడప్పుడు మెరిసే మెరపు వెలుగులో ఆశతో భగ్గున వెలిగే ఆమెకళ్లూ—చేతిలో అల్యూమినియం చిప్ప తప్ప ఇంకేమీ కనపడడం లేదు.

ఒక వీధి అంతా నిశ్శబ్దంగా నడిచి వచ్చింది. అన్ని ఇళ్లూ గాఢనిద్రలో ఉన్నాయి. దేన్ని పలకరించినా కదిలి కొడు తుందని భయమేమో—

రెండోవీధి— మూడోవీధి— తిరిగిపోయాయి. ఏ తలుపు లోంచి దీపకళిక తొంగిచూచినా కొంతఆశ—ఆవేళ దీపాలు గూడా నిద్రపోతున్నాయి.

నాలుగో వీధి గూడా వచ్చింది. అన్నీ మేడలు. మేడలంటే దరిద్రులికి ఎందుకో ఆశ. వాటిలో కావలసినంత డబ్బు—దర్జా—తిండి—బట్టలు నిండి ఉంటాయి. బిచ్చగాళ్లని రమ్మని పిలుస్తాయి. తమకోసం, లేనివాళ్లుపడే తహతహచూసి తృప్తిపడి, అప్పుడు వాళ్లని రెట్టింపు ఈసడింపుతో మెడపట్టుకు గెంటు తాయి. అయినా బుద్ధిలేదు.

ఇదీ వరస—

ఒక మేడ, పై అంతస్తులో, కొంచెం అలికిడిగా ఉంది. కింది తలుపులు పెదవికదపవు. లోపలినుంచి అంతరాత్మ "అడుగు—నోరుమూసుకు నడిస్తే పీటవేసి పిలుస్తారా? ఎవరైనా—" మనస్సు "ఊరికే అరవమన్నావా? ఎవరూ కనపడరు"

ఆత్మ "ఇక ఈ వీధిగూడా అయితే నీపని మాడడమే—ఉదయంనుంచీ తిండిలేదు—పెడితే పెడతారు లేకపోతే లేదు ఇక్కడ గట్టిగా అరువు—"

విధిలేక మేడమెట్లెక్కింది. "మాడాకవళం..." "ఛాప్—ముందు మెట్లుదిగు. అక్కణ్ణించి అడుగు—ఆమురికినీళ్లన్నీ గుమ్మంలో చూస్తే అయ్యగారు మమ్మల్ని తిడతారు" మెట్లు దిగింది. గట్టిగా "పొద్దుట్నించి కూడులేదు. కాస్తపెట్టించండి బాబయ్యా" కడుపుమంటకొద్దీ తారక స్థాయిలో అడిగింది.

మేడమీది వెచ్చని ముసుగు సుఖానికి తగిలింది. కదిలింది. పై కిటికీలోంచి "ఈ వెధవ ముష్టివాళ్లకి వేళాపాళాలేదు. పొద్దున్న తగులడగూడదూ—" స్వగతం.

ప్రకాశంగా "ఎవర్రా కింద—గాడిదా—జవాబు చెప్ప లేవూ?" దయ ఉట్టిపడుతోంది. నౌఖరు ఖంగారుగావచ్చి "పోపో—పొద్దుటరా—బుద్ధిలేదూ—వేళగాని వేళ—అంతర్ని లేవుగుంటూ—"

వెళ్లిపోయింది.

ఇంకో మేడ. గుమ్మం ఓరగా తీసిఉంది. మాటలు వినపడు తున్నాయి. రెండు పురుష కంఠాలు.

"ఎంత కలెక్టు చేద్దాం"

"కనీసం మూడువేలేనా ఉంటేగాని మనచెయ్యి పైగా ఉండదు. బీహారువంటి చోటికి పంపుతున్నామంటే తెనుగు వాళ్ల బారీ తెలియాలి" ఏమంటారు ?

"మనం ఇంత శ్రమపడుతూన్నందుకు..."

"ఎంతమాట—ఈరిలీఫ్కమిటీకి మీరు ప్రెసిడెంటు—కాకుండా రాజేన్బాబు ముఖ్యంగా మిమ్మల్ని గుర్తించి కృతజ్ఞతతో ఉత్తరం రాస్తాడు"

"దానికేంలెండి—సోదర భారతీయులు దైవదుర్విపాకంవల్ల కష్టాలపాలైపోతూఉండగా కాస్త మెదడుఉన్న ఎవని మనస్సు."

"బాబయ్యా, పొద్దుట్నించి తిండిలేదు. ఒక్కముద్ద పెట్టించండి తండ్రీ"

"ఎవరదీ ? ఇప్పుడులేదు. గోలచెయ్యకు"

"తెలిసిన మారాజులు—కనికరించండి బాబూ"

"మొండివెధవలు—చెప్పినమాట అర్థంకాదు తగుమనిషితో మాటాడుతూంటే......దయచెయ్యి" తలుపు దడాల్న మూశాడు.

ఇంక ఆశలేదు. ఈరోజు పూర్తిగా తిండిలేదు. నాలుగో వీధిగూడా ఆఖరయిపోయింది. ఇక అంతా ఇంతే. ఎవ్వరూ పెట్టరు. అల్యూమినియం చిప్పకేసి చూసింది. దానికడుపూ నకనకలాడుతోంది. "నీకూలేదూ నాకూలేదు బువ్వ—అందరికీఉంది మనిద్దరికేలేదు. మంచి నేస్తులం" నిరాశతో

గిర్రున తిరిగిన రెండు నీటిబొట్లుజారి చిప్పలోపడ్డాయి. చిప్ప తలమీద బోర్లించుకు బయులుదేరింది. ఊరవతల ముష్టివాళ్ల జువ్విచెట్టుకిందకి.

3

తెరపి యిచ్చిన ఆకాశంమీాది నక్షత్రకాంతిలో మూఖంకనపడు తోంది. బట్టపీలికలు కొంచెం ఒంటివేడికి ఆరాయి. తిండిలేని పడుచువాళ్లు ముసలివాళ్లలా కనపడతారు. తినడానికున్న ముసలివాళ్లు పడుచుగా ఉంటారు. తిండిఉంటే ఆమె పడుచు. మెరిసేకళ్లలోంచి కదిలేరొమ్ములోంచీ ఎంతపొమ్మన్నా యౌవనం పోవడంలేదు.

పరధ్యానంగా నడుస్తూ రోడ్డు కడ్డంగా పడుకున్న కుక్క కాలు తొక్కింది. కుక్క కంయిమని లేచింది. ముష్టిమనిషి నవ్వింది.

"కుక్కలు దిలాసాగా బతుకుతున్నాయి. పురుగులు ఇంకా ఎన్నో నిశ్చింతగా నిద్దరోతున్నాయి. మనిషికి బతుకులేదు. తిండిలేదు. మాటలొచ్చు. మంచిచెడ్డలు తెలుసు...అందుకే తిండిలేదు.

కూలిపని చేసుగోవచ్చు—ఇక్కడ అంతా కూలీలే—చేయించుకునేవాళ్లు కావాలి.

మొగాడు ఎట్లాగో కొట్టుకుతింటాడు. లేకపోతే దర్జాగా మాడుతాడు. కాని ఆడది...లేకపోతే తిండిలేకపోవడమే. ఉంటే...మొగకుక్కలు వెంటపడేటంత..." మనస్సులంది.

నడుస్తోంది.

4

కనుచూపు మేరలో ఎడంచేతి వెంపుగా మిణుకు మిణుకుమంటూ చిన్న దీపం కనబడింది. దీపంచూడగానే ముష్టిమనిషిఆకలి మళ్లా రాజుకుంది. 'ఎవరో—అక్కడ'

"ఏమైనా దొరుకుందేమో తినడానికి"

"ఎవరో"

"ఎవరుంటే—వారే"

ఆశ రేగింది. ఆవైపు నడిచింది. దీపాన్ని గుర్తుగా ఉంచుకొని నడచివెళ్లింది.

జట్కాలూ ఒంటెద్దుబళ్లూ నిలిచేచోటు. పక్కని ఒక కూలిపోడానికి సిద్ధంగాఉన్న పాతపెంకుటిల్లు అరుగుమీద మినుకు మినుకుమనే దీపం. దానిపక్క షేక్ ఇషేక్ సాయిబు తాలూకు చవకరకం 'టీ—రొట్టెలకొట్టు'. జట్కాసాయిబులూ ఒంటెద్దుబండి నాయుళ్లూ దాని రాజపోషకులు.

ఈవర్షపు రాత్రి ఆటే బేరాలులేక ఇషేక్ టీకొట్టు అరుగుల మీదకుచేరి రాజపోషకులందరూ వెచ్చని టీ తాగి ఇంజన్లలా పొగలు చిమ్ముతూ చాలాసేపు కాలక్షేపంచేసి వెళ్లారు.

5

"గెందబనీ జావుంగే సయ్యా తేరీ గోదుమే" ఇషేకు ఖులాసాగా పాడుకుంటూ కొట్టు సర్దుకుంటున్నాడు.

ముష్టిమనిషి చూచింది. నోట మాటరాలేదు. ఎవరో కాపురండుండే ఇల్లు అనుకొనివచ్చింది. తిరిగి పోవాలనుకుంది. ఆతురక కంట పడకూడదు. చావగా మిగిలిన హిందూరక్తం గుండెలకు ఎగదన్నింది.

గిర్రున వెనక్కి తిరిగిచూసింది. అంతా చీకటి. తను నివాసపు జువ్విచెట్టు అక్కడికి కుడిచేతివైపుగా నాలుగుఫర్లాంగు లుంది—ఎదురుగా చిన్నదీపం. మనిషి వాసన. వెనక అయోమయం అంధకారం నిరాశ. మళ్లా జువ్విచెట్టు. ఒళ్లంతా పీకే చీమలు—ఎముకలుకూడా చల్లబడేచలి. ఈ వర్షానికి చెట్టుకింద బాగా తడిసి నీరుచేరి ఉంటుంది. పక్కముష్టాళ్లు తినగా మిగిలిన బియ్యం, అన్నం, పొగాకుకీ, గంజాయికీ, నల్లమందుకీ అమ్ముకుంటారుగాని ఒక్కవెధవా పేరెడు బదులియ్యడు. ఏంబావుకోవాలి అక్కడ ?

ఎదురుగుండా అరుగుమీద టీపాయ్యా, రొట్టెల జంగిడా కనపడుతున్నాయి.

కాళ్లులాగుతున్నాయి. చలిచేత గుండె పీకుతోంది. వెళ్లి నీరసంగా ఒక అరుగుచివర చదికిలబడింది. ఇపేకు, ముందు, కొట్టుసర్దుకునే తొందరలో ఆమెను గమనించలేదు. అన్నీ లోపలపెట్టి టీ 'కెటిలు' పట్టుకువెళుతూ చూచాడు.

"ఎవరూ నువ్వు అమ్మా"

మాటాడలేదు.

"ఎవరికోసం"

ఈ మాటలో ఏదో అపార్థం ఉన్నట్టు తోచింది. కాని లేచే ఓపిక లేదు.

"చలిగా ఉందీ—పాపం—కొంచెం టీ తాగు"

మురకలకు కూడా దయ ఉంటుంది గాబోలు—కాని—

"డబ్బులు. లేవు"

దీపం వెలుతురులో ఇషేకు ఆమెను బాగా చూచాడు.

తిండి లేకగాని—నల్లదనంలో మెరుగైన శరీరం. "డబ్బుల్ గిబ్బుల్ జాంతానై...ఉల్సా" మాట్లాడలేదు.

పెద్దవి రెండు నాన్ రొట్టెలు—ఒక కప్పులో టీ తెచ్చి ముందుంచాడు. ఆమె గుండెలు కొట్టుకున్నాయి. లోపలినుంచి ఎవరో 'వద్దు ముట్టుకోకు—మనజాతి...అవమానం...బలి...' అని అరుస్తున్నారు. నరాలు వెచ్చని పానీయానికి, మనస్సు బలమైన రెండు రొట్టెలకీ లొంగమంటున్నాయి.

రెండు రొట్టెలూ హాయిగా తిని టీ తాగింది. లోపల వెచ్చ పడుతూన్నకొద్దీ పై చలిగాలి దుర్భరంగా ఉంది.

ఈదురుగాలికి ఆమె వణకడం అతడు చూచాడు—

"ఏయ్ అమ్మా లోపలికి రా—దోకపడా ఇస్తాను—చలీ గిలీ చల్ జాయగా" అని నవ్వుతూ ఆమె చేయిపట్టుకొని లేవదీసి లోపలికి నడిపించి, వీధి తలుపు వేశాడు.